సృష్టికర్తలు

అల్లం రాజయ్య

ఇంకా సూర్యోదయమన్నా కాలేదు. ఆకాశం కడిగిన పళ్ళెం తీరుగున్నది. తూరుపుదిక్కు ఒకటీ అరా మేఘపు ముక్కలు ముఖం మాడ్చుకొని వేళ్లాడుతున్నాయి. ఉదయించని సూర్యకాంతి ఆకాశానికి ఎర్రిమట్టి పూసినట్టుగున్నది. చెట్ల ఆకులు రాత్రి కురిసిన వర్షానికి పచ్చగా నిగనిగలాడుతూ లోకంలో ఇంకా ఏ అన్యాయం చూడని పసిపిల్లల మొఖాల్లా వెలిగిపోతున్నాయి. గాలి ఉండీ ఉండీ వీస్తోంది. ఆ గాలికి గుట్టబోదు కింది భాగంలోని ఈత లేతాకులు "బొంయ్యి" మని శబ్దం చేస్తూ కదులుతున్నాయి. కొండరాళ్ళ మీదినుండి జలజల ఇంకా రాత్రి కురిసిన వర్షపునీళ్లు జారుతూనే ఉన్నాయి. వాగు ఎర్రినీళ్ళతో నిండి అదేదో సందడిగా, అలజడిగా అనేక మంది కలిసి తర్జన భర్జన పడుతున్నట్లుగా పారుతోంది. చెట్లకొసల మీద అప్పుడే స్వేచ్ఛ పొందినట్టు, ప్రపంచంలోని సంతోష మంతా తమదేనన్నట్లు పక్షులు పల్టీలు కొడుతున్నాయి. అడివి అంచుకు పచ్చగా నవనవ లాడుతున్న గడ్డిని విడిచి కొన్ని పశువులు ఒకటి నొకటి గెదుముకుంటూ చెంగలిస్తూ ఆడుకొంటున్నాయి. ముసలి ఎడ్లు సయితం లెంకలేసి పుట్టలు చిమ్ముతూ ఎర్రిమట్టి కొమ్ములకు, ముఖాలకు పూసుకొని వీరోత్సాహంతో ఉన్నాయి. అన్నికాలాలు తెలిసిన వాటిలాగా, సంతోషం, విషాదం లేనట్టుగా, తమకీ సందడి పట్టనట్టు బర్లు వాగులో అక్కడక్కడ తేలిన తుంగ గడ్డలను బరుకు బరుకున పీక్కతింటున్నాయి. వాగొడ్డు ఎర్రి సెలుకలనుండి అక్కడక్కడ పురుగులు లేసి తిరుగుతున్నాయి. ఆరుద్ర పురుగులు నేలమీద పాకుతున్నాయి.

అదిగో అలాంటి వాతావరణంలో తూర్పు దిక్కు సూర్యుడు ఉదయించాడు. సూర్యునితో పాటు కిరణాల్లాగా భుజాలమీద నాగళ్లెత్తుకొని, పలుగు పారా బట్టుకొని నేల ఈనినట్టుగా జనం ఎర్రి సెలుక వేపువచ్చారు.

నాగండ్ల వాళ్లు నాగండ్లు సెలుకలో దించి తాళ్లు సరిచేస్తున్నారు. స్త్రీలు కొంగులు నడుములకు చుట్టి రాళ్లరప్పలేరుతున్నారు. పెయిమీద అంగీలు లేనివాళ్లు కొందరు నోట్లె మొక్కసుట్టలు ఆవలపారేసి పాతగుడ్డపేగులు తలలకు చుట్టి పగ్గాలు విప్పుకొని అడవి అంచు ఎడ్లను పేరుపేరున పిలుస్తూ ఎడ్ల ముక్కుదాళ్ళకు పగ్గాలు కట్టి నాగండ్ల దగ్గరికి తీసుకొచ్చారు. కానికి మొక్కి కొందరు ఎడ్ల మెడల మీద కాని ఆనించారు. నాగండ్లు నిలబడ్డయ్.

ఎర్రితేలులాంటి ఎల్లయ్య ఎక్కన్నో నాలుగు ఈత పెండెలు విరుసుకచ్చాడు. ఎల్లయ్యభార్య ఒళ్ళె నుంచి నాలుగు ఎర్రిజెండలు తీసింది. ఎల్లయ్య కొయ్యలకు జెండాలు తగిలించి నాలుగువేపుల నాలుగు పాతచ్చాడు.

706

బుర్రమీసాల బుచ్చిలింగం అందరిని ఓపారి తేరిపార చూసిండు- అతని మనుసులో వాగులోని ప్రవాహంలాగా మాటలులేని సంతోషం పోటెత్తుతోంది- కుర్రె కట్టె చేతబట్టి కోండ్రలు గీసిండు- పొట్టిలాలయ్యా ఓడిగట్టుకొని గుట్టకు మొక్కి- సెలుకకు మొక్కి- అటెన్క- తూరుపుకు మొక్కి- ఇత్తనం జల్లిండు-

ముందటి నాగలి కదిలింది- కర్రు కస్సున భూమిలోనికి దిగింది- ఎడ్లు తోకలు ఆడించినయ్- ఒకటెన్క- ఒకటి- ఒకటా రెండా ముప్పయి నాగండ్లు కదిలినయ్-

బర్ల దగ్గర సంకల కట్టె అనించుకొని ఓటుగాలు మీద నిలుచున్న బర్ల ఓదన్నకు గిదంతా చిత్రంగా కనిపిస్తోంది- పూరేడుపిట్ట కళ్లలాంటి కళ్లు చికిలించి నాగండ్లవేపు చూసిండు. బర్రె పెయ్యిలాంటి పెయ్యిని గీతలుబడ బరబర గోకిండు- నెత్తి పనుక్కున్నడు- బర్రె పెదిమిల్లాంటి పెదిమలు ఎందుకో వనికినయ్- ఎందుకో పూరేడు పిట్టలాంటి కళ్లల్లో నీళ్లూరినయ్- అతనికి తన చిన్నతనం, వయసు, స్వంతభూమి, భార్య, పిల్లలు యాదికొచ్చారు- ఆవెనువెంటనే తాను నాగలిబట్టి దున్ని దోకిన రోజులు కళ్ల ముందు మెదిలినయ్- అప్పుకింద భూమిపోయిన దినం- కాలెంత రోగవచ్చి భార్య పోయినదినం- పసిపోరగండ్ల ఎంటేసుకొని బతికినదినాలు- పసిపోరగండ్ల తన చేతులతోనే పట్టేల కప్పిన దినాలు- తన చేతికి కట్టె వచ్చిన రోజు- ఊరి బర్ల కాపరిగా మారినదినాలు- అన్నీ గుర్తు కొచ్చాయి. అట్లా ఎంత సేపు నిల్చున్నడో ఓదెలుకు గుర్తులేదు-

తూర్పుదిక్కు- సూర్యుడు చురచుర చుంటున్నాడు- అకాశంలో మబ్బులు కుదురుకుంటున్నాయి- నేలంతా పొగచూరినట్టుగా దుమ్మెన పురుగులు లేచాయి- బర్లు నీళ్లల్లో పన్నయ్- ఎక్కడో తీతువ పిట్ట అరుస్తున్నది-

పిల్లలు బరిబాత వాగొడ్డుకు ఎండ్రికిచ్చలు, జిమ్మలు పడుతూ, కొందరు ఈదుతూ, కొందరు ఇసుకలో పొర్లుతూ కేరింతలు కొడుతున్నారు-

పిల్లల మీది నుండి దృష్టి మళ్లీ నాగండ్ల మీదికి మలిపాడు- కండ్లు నిలబడి పోయాయి- ముఖం మీద ఎవరో ఘాడిచ్చి గుద్దినట్టుగా కమిలిపోయింది- ఆవరబాదరా గెంటుకుంట గెంటుకుంట ఆవలి ఒడ్డునుండి ఈవలి ఒడ్డుకు దాటి గెంటుకుంట గెంటుకుంటనే పరిగెత్తాడు- కాళ్లకు రాళ్లు తాకుతున్న లక్షనంలేదు-

ఓదెలు నాగండ్ల దగ్గరికి చేరుకునేసరికి నాగండ్లన్నీ ఆగిపోయినయ్. ఎడ్లు సిర్రుబుర్రులాడ్తున్నయ్- పిల్లాజెల్లా, ఆడోల్లు, మొగోల్లు అంత ఒక్కకాడికి జేరి పోయిండ్లు- ఎవలేం మాట్లాడ్తుండ్లో ఎవలికినబడ్త లేదు-

707

మందిని తొలిగించుకొని మూతి లోపలికిబెట్టి ఓదెలు చూసిండు- మందిల ఏడుగురు పోలీసోల్లు తుపాకులెక్కుబెట్టి పండ్లెల్లబెట్టి మొరిగే కుక్కల్లా మొరుగుతున్నారు- వాళ్ళ మధ్యలో దర్జాగా నిల్చున్న అమీన్‌సాబ్ పిస్తోలు పట్టుకున్నాడు. అతనిపక్క ముత్యంరావు దొర ముఖం మాడ్చుకొని నిల్చున్నడు. అతనిపక్క పట్వారి గోపయ్య సెయ్యెత్తి అంతూపొంతూ లేకుంట తిడ్తుండు-

కాసేపు సంగతేందో బోధపల్లే-

అంతలోకే "మాకెలపుడా మార్ సాలెకుమార్-" యస్ ఐ అరిచిండు-

పటేల్- పటేల్- బరిబాత పెయిలమీద లాఠీదెబ్బలు- పిల్లలు ఏడుస్తున్నారు. స్త్రీలు శాపనార్థాలు బెడుతున్నారు- కాని ఎవలు కదలరే- ఓదెలు బుర్రమీద లాఠీదెబ్బ- ఎడంచేత పునికిచూసుకున్నడు. నెత్తురుకూడా కమిలిపోయి పిడుదునెత్తురై పోయింది. కాని అంతరంగంలో కోపంఎర్రగా రవులుకుంటోంది- అదెక్కడికోపమో? ఎన్నేండ్ల కోపమో? ఎవరికెరుక?

"ఆపుండ్లి-"

లాఠీలాగినయ్-

"అరె హరామ్‌కెబచ్చె- గీభూమి మీదిగాదు-

ఉత్తపున్నానికి దెబ్బలెందుకుదింటరు బే- సదువుండ్లి- ఎల్లిపొండ్లి- లేకుంటె మాదెక్‌సోద్ ఒక్కొక్కన్ని పిట్టనుగాల్సినట్టుగాల్చి కాకులకు గద్దలకేత్త-" యస్.ఐ-

"ఒరే లంజకొడుకుల్లాలా- మీయమ్మలకుక్కల్.... నాకుమీకు ఎప్పుడో సెల్లుబాటయ్యింది- ఎండకాలం పనులు బందుజేసి నాయేంబీక్కున్నరు- మీఎనుకున్న పార్టోల్లూ, మీరూ నా రోమం బీకలేరు రా- నేనేతలుసుకుంటె మసిదామసి జేసిపారేత్త" ముత్యంరావుదొర-

"వారీ గిదేంనాయెంరా? మందిభూములు దున్నుకోను పాపమా? పచ్చిభూతర్రా ఇయ్యాల్ల సేండ్లమీనబడి దున్నుకుంటరు- రేపు ఇండ్లమీదబడి దోసుకుంటరు- మనూల్లె పోలీసోల్లుండంగనే గింతపనికెత్తుకుంటిరి. లాపోతెనా మాయిండ్లకగ్గి తల్గబెట్టి పేలాలేరుక బుక్కుతరు-" గోపయ్య

"నీబాంచెనాతె నీపేరుదల్సుకుంటె బుక్కెడుబువ్వన్న దొర్కది"- కొండమ్మ చేతులు మెటికలిరిసింది-

ఓదెలు పెదిమలు పనికినయ్- ఏదోచెప్పాల్నని నోరుతెరిసిండు- కని ఏది చెప్పలేక పోయిండు-

708

"మీ సంఘపెద్దెవరా ?" అమీను గర్జించిండు

ఎవలూ మాట్లాడలేదు—

"ఇక్కన్నుంచి కదులుండ్లి— ముదుగాలు గ జెండాలు పీక్కరాండ్లి— నక్సలైటు నాకొడుకుల లానాకు పట్టుకపోత—"

పోలీసులు జెండాదిక్కు కదిలిండ్లు—

ఎల్లయ్య పరుగందుకున్నడు— జెండాకొయ్యదగ్గర నిలుసున్నడు— పోలీసోడు తుపాకిమడమతోటి ఎల్లయ్యను అంచిగుద్దిండు—

జనంలోకదిలిక— పోలీసుల సుట్టూగిరేసుకున్నరు—

"ఖబర్దార్ జెండాలు ముట్టుకున్నరో గీడనెత్తురుదొల్లాలె—" ఎవడో ఛాతిబాదు కుంటూ గొంతు తెగిపోయేటట్టు అరిచిండు.

అమీన్ పిస్తోల్ గాలిలోనికి పేల్చిండు— దొరకండ్లల్లో కూసంత బెదురు— గోపయ్యకాల్లు వనుకుతున్నాయి—

జనంలో హాహాకారాలు మిన్నుముట్టాయి— ఒకపోలీసోడు జండా అందుకున్నడు అన్నిజనం చుట్టేసిండ్లు— "ఒకటి— రెండూ— మూడు—" అమీన్ బండగొంతుతో అరుస్తున్నాడు—

తుపాకులు మొరిగినయ్—

ఒకస్త్రీ నాగటిచాల్లల్లోపడి గిలగిల తన్నుకుంటుంది— కడుపులనుంచి కార్తున్న జీవరక్తం ఎర్రగా నాగటిచాల్లో పారుతోంది— ఎవరో యస్. ఐ.మీద దునికిండు. పిస్తోలు పేలింది— ఇంకొకడు ఎర్రిమట్టిలో తన్నుకున్నడు—

ఆకాశంలోకి రాళ్లలేసినయ్— కాని తుపాకులముందు రాళ్లనిలుపలేదు— అట్లా మరోపదినిమిషాలు తుపాకులు మొరిగినయ్— అడివి ప్రతిధ్వనించింది— చెట్లు పుట్టలు బట్టి జనంఉరికిండ్లు— ఆఖరుకు ఎల్లయ్య ఓదెలుతోసహా పదిమంది పురుషులు, నలుగురు స్త్రీలు, నలుగురు పిల్లలు దొరికారు.

వాళ్ళందరిని తుపాకులు ఎక్కుబెట్టి నడిపిస్తూ వాగుదాటి ఈవలొడ్డు జేరుకున్నరు—

నెత్తిమీదికి పొద్దచ్చేటాల్లకు పోలీసువ్యాన్ బుర్రుమన్నది—

709

సగందున్నిన ఎర్రిసెలుకలో ఇంకా మూడుఎర్రిజండాలు రెపరెపలాడుతూనే ఉన్నాయి—

*　　　　*　　　　*

ఆరాంత్రంతా నిరాయుధులైన బందీలను తాళ్ళతో మట్లకుకట్టేసి కొట్టవలసిన వాళ్ళంతా కొట్టారు— పిల్లల లేతశరీరాలమీద యస్.ఐ. కొట్టాడు, తన్నాడు. స్త్రీలమీద అమానుషకృత్యాలు అన్నీ జరిపారు. పురుషుల శరీరాలు నెత్తురు ముద్దలై పోయాయి.

అయినా ముత్యంరావుకు కసితీరలేదు— నిరుపేదజనం సంఘంపెట్టుకున్న నాటి నుండి సంఘంబలపడినదాదిగా బలపడిన కసి కోపం చల్లారలేదు— గోపయ్య ఆ రాత్రింతా తాగుతూ ముత్యంరావుకు ఏదో చెప్పుతూనే ఉన్నాడు. అమీన్ పెట్టాల్సిన కేసుల గురించి తల పట్టుకున్నాడు—

బ్రాందీసీసాల మధ్య ఆలోచనలు సాగినయ్. క్యాంపు పోలీసులు రాత్రి ఊరు మీద పడ్డారు. ఇల్లిల్లు గాలించారు. గడుక కుండలు పగుల గొట్టారు— నిశిరాత్రి ముసలివాళ్ళు ఏడుస్తుంటే ఊరంతా గస్తీతిరిగారు— ఆ రాత్రి ఎల్లయ్య గుడిశెతో పాటు మరి నాలుగు గుడిశెలు కాలిపోయాయి—

తెల్లారి నెత్తురు ముద్దలై దొరికిన వాళ్ళను వ్యానెక్కించి సబ్‌జైలుకు పట్టుక పోయారు—

*　　　　*　　　　*

కోర్టు గదిలో ఫ్యాను గద్దలా తిరుగుతోంది—

ఎత్తుగద్దె కుర్చీమీద జడ్జి అసహ్యంగా ముఖం పెట్టి కూర్చున్నాడు— అతను నల్లగా నున్నగా కొరిగిన మీసం గడ్డంతో తాటిపండు తిరుగున్నాడు. ఎత్తుపొట్ట, ఎర్రగా ఎద్దుకండ్లలాంటి కళ్ళు—

అతని టేబుల్ ముందు ముసలిగుమస్తా అదేపనిగా రాస్తున్నాడు వంచిన తల ఎత్తకుండా

జడ్జి నెత్తిమీద గాంధీ ప్రశాంతంగా ప్రపంచంతో తనకేమీ సంబంధంలేనట్టు, అహింస నవ్వులు నవ్వుతున్నాడు—

జడ్జికి కుడివేపు అందంగా బైండుచేసిన పాపాల రికార్డులు, లా పుస్తకాలున్నాయి వాటి మీద బంగారంగు అక్షరాలు కొట్టొచ్చినట్టు రాసున్నాయి—

710

జడ్జి టేబుల్‌కు కొంతదూరంలో పెద్ద కర్రిటేబుల్– దాని ముందు నల్లగౌన్ల లాయర్లు అసత్యాలఫైళ్ళు అతి జాగ్రత్తగా పట్టుకొని కూర్చుండి అవసరంలేని విషయాలు గుసగుస లాడుతున్నారు.

పక్కగదిలో పి.పి.ఓ. లక్ష్మణ్‌రావు, డియస్‌పితో మాట్లాడుతున్నాడు.

జడ్జి బెల్లు మోగించాడు– కోర్టు జవాను బయట ఏదో పేరును బొంగురు గొంతుతో పిలిచాడు–

పి. పి. ఓ. పరుగెత్తుకొచ్చాడు–

ఆ తరువాత అమీన్ ఇద్దరు పోలీసులు వెంటరాగా కాసంత బెదురు ముఖాలతో మాసిన గుడ్డపేగుల రైతులు, రైతుస్త్రీలు, నలుగురు పిల్లలు ప్రవేశించారు– ఎల్లయ్య బోనెక్కాడు– అతనివెనుక ఓదెలు– అందరు వరుసగా నిలుచున్నారు–

లాయర్ల ముఖాల్లో అసహ్యం రూపు కడుతోంది–

పి.పి ఓ. గొంతు సరిచేసుకొని ఉత్తిగనే గాలిపంఖా వేపు కాసేపు చూసి అలవోకగా కత్తిరించిన కుడిమీసం మీద గోక్కొని– రైతులను చూడ కుండానే జడ్జిని చూశాడు–

జడ్జి రైతులను చూశాడు–
పి.పి.ఓ. కాయిదాలు బల్లమీద పడేసి కొంచెం ముందుకు నడిచి–

"యువరానర్" అని కాసేపు ఏదో గుర్తుకు తెచ్చుకోను ప్రయత్నం చేస్తున్నట్లు నటించి– పక్కగదివేపు– ఓరకంట చూసి అక్కడ గ్లాస్కోధోవతి తచ్చాడడం, కరుకుబూట్లు కదలడం గమనించి సంతృప్తిపడి, కొత్త ఉత్సాహంతో ఈ విధంగా వాదించాడు–

"ముద్దాయిలు చూడడానికి చాలా అమాయకంగా, నిరుపేద వాళ్ళుగా కనిపిస్తున్నారు. యువరానర్– అదంతా పైపైనటనే– వాళ్ళ గురించి మనం తెలుసుకుంటే లోకంలో ఎంతటి క్రూరత్వం, అన్యాయం తాండవ మాడుతున్నదో మనం అర్థం చేసుకోగలం– ముద్దాయిల గురించి చెప్పేముందు కొంత అగ్రామం గురించి తెలుసుకోవాలి– రాజకీయంగా కూడా ఈ కేసు చాలా ఆసక్తి కరమైంది–

నక్కల గూడెం 1976 దాకా ప్రశాంతంగా ఉన్నది– అక్కడ ఎవరి పనులు వాళ్ళు చేసుకుంటూ– అనివార్యంగా తలెత్తిన చిన్నచిన్న తగువులు వాళ్ళలో వాళ్ళ

711

సర్దుబాటు చేస్తూ– వీళ్ళను కన్నబిడ్డలుగా ముత్యంరావుగారు చూసుకునేవారు. గతంలో ఈ ఊరినుండి ఒక్క కేసుకూడా కోర్టు వారి దాకా రాకపోవడం గుర్తించాలి.

అలా ఉండగా ఇదిగో ఈ కేసులో మొదటి ముద్దాయి నక్కల ఎల్లయ్య దేశ విద్రోహ, సంఘవిద్రోహ శక్తులతో చేతులు కలిపాడు– అలాగా బాహాటంగానే కమ్యూనిస్టులు ఊళ్లోకి రావడం మొదలయ్యింది– మీటింగులు, ఉద్రేక పూరితమైన ఉపన్యాసాలు, రెచ్చగొట్టే పాటలు మామూలైపోయాయి– ముత్యంరావుకు ప్రజలకు మధ్యనున్న సంబంధాన్ని ఆ విధంగా విచ్ఛిన్నంచేసి ముత్యంరావుగారికి వ్యతిరేకంగా జనాన్ని రెచ్చగొట్టారు–

మొదట ఇక్కడున్న వాళ్లంతా అలా ముత్యంరావుగారికి వ్యతిరేకంగా తయారయ్యారు. ఉద్రేకపూర్వకంగా కూలిరేట్ల గురించి తగాదాపడ్డారు– ముత్యంరావుగారు కూలిపెంచారు– దానితోని ఊర్కోక ఏదో సాకుతోటి ముత్యంరావుగారి ఇంటిమీదికి దాడికి వెళ్లడం ఆయనను చంపుతామని, కొడుతామని బెదిరించడం– తేది 20 జనవరి 1978లో ఒకమారు కర్రలు, కత్తులు గొడ్డండ్లు ధరించి ముత్యంరావుగారి ఇంటిమీద మొదటి ముద్దాయి ఎల్లయ్య నాయకత్వంలో దాడిచేసి– ఇంట్లో ఫర్నీచర్ విరగ్గొట్టారు. తేది 2.2.78 నాడు అతని మక్క జొన్న పెరడు సర్వనాశనం చేశారు– ఇంకా పశువుల నెత్తుకపోయారు పంటలు నాశనం చేశారు– పడారిగోడ కూలగొట్టారు– గడ్డి, చొప్ప ధాన్యం ఏది దొరికితే అది పట్టుకపోయారు. ఇలాగా యువరానర్ నేను చాలా సంఘటనలు చెప్పగలను. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే–"

"అన్నాలెందొరా! పచ్చులసొంటోల్లందొరా! మామీన్నేపడి కొట్టిచ్చిండు దొరా–" ముసలివెంకయ్య చేతులు జోడించి పదే పదే మొక్కాడు–

"ఆడర్– ఆడర్–" జడ్జి సుత్తె బల్లమీద కొట్టాడు– పి పి.ఓ. కొనసాగి–

"అలాంటి పరిస్థితిలో తన కుటుంబం ధన, మాన, ప్రాణ రక్షణకోసం పోలీసులకు, ప్రభుత్వానికి తనగోడు చెప్పుకున్నాడు. ఫలితంగా పోలీసులు ఆ ఊళ్లో క్యాంపుబెట్టారు–

"అవద్దం– మమ్ముల సర్వనాశిడం సెయ్యటానికి తీసుకచ్చిండు దొర–" లక్ష్మి– మళ్లీ జడ్జి మూలిగిండు– కర్ర సుత్తె శబ్దం–

"యువరానర్! అన్నిటికి తెగించిన ఈ సంఘవిద్రోహ శక్తులకు పోలీసులన్నా లక్ష్యంలేదు– 1979 జూన్ 21న మొత్తం ఊరు ఊరంతా కలిసి ముత్యంరావుగారి

నూరెకరాల చెలుకలో ఎర్రజెండాలు పాతి అక్రమంగా దున్నుకోవడం సాగించారు- మామూలుగానే ముత్యంరావుగారు, యస్.ఐ. కొండారెడ్డి, మరి ఏడుగురు పోలీసులు చెలుక దగ్గరికి వెళ్ళారు- యస్.ఐ. కొండారెడ్డి నచ్చచెప్పడానికి ఎంతో ప్రయత్నం చేశాడు- కాని జనాన్ని విననివ్వరే - ఎల్లయ్య తూలనాడుతూ జనాన్ని రెచ్చగొట్టాడు. ఫలితంగా జనం రెచ్చిపోయి పోలీసుల మీద ముత్యంరావుగారి మీద పట్వారి గోపయ్య మీద రాళ్లతో దాడికి సిద్ధమయ్యారు- పైగా చుట్టూ చక్రబంధంగా నిలబడి ముల్లు కర్రలతో దాడి చేయడానికి సిద్దపడ్డారు- తప్పని సరైన పరిస్థితిలో లాఠీచార్జి చేయ వలసి వచ్చింది- ఆ తరువాత కొంత ఘర్షణ తరువాత గుంపు చెదిరిపోయింది- పరిస్థితి చక్కబడ్డట్టుగానే కనిపించి పోలీసులు, ముత్యంరావుగారు వెనుకకు తిరిగి వచ్చారు-

కాని ఆ రాత్రి ఎల్లయ్య నాయకత్వంలో మళ్లీ దాదాపు 500 మంది జమై ముత్యంరావుగారి ఇంటి మీదికి దాడి చేశారు- తనకు రక్షణగా ముత్యంరావుగారు ఉంచుకున్న బైరి రాములు, బందెల లింగయ్య ఇండ్లు కాలబెట్టి - ఊరంతా బీభత్సం సృష్టించారు- పోలీసులు జోక్యం చేసుకొని ఈ బోనులో నిలబడ్డ వ్యక్తులను అతి కష్టం మీద కస్టడీలోకి తీసుకోగలిగారు...."

"మోసం- దగా-" వెంకటి అరిచిండు- ఎవరో అతని నోరు మూసిండ్లు-

"ఈ విధంగా మొదటి ముద్దాయి ఎల్లయ్య, రెండవ ముద్దాయి అంకం నాగమల్లు నాయకత్వంలో ముద్దాయిలు మరి నాలుగు వందల మంది కలిసి గృహదహనాలు, దోపిడి, ఆస్తినష్టం, పరువునష్టం- మొదలగు అకృత్యాలే కాక ముత్యంరావుగారిని చంపడానికి ప్రయత్నం కూడా చేశారు-

కావున ముద్దాయిలు 197, 307, 144 ఇండియన్ పీనల్ కోడు ప్రకారంగా శిక్షార్హులు

కోర్టువారు విచారించి న్యాయం చేయగలరని, ముత్యంరావుగారికి ప్రాణ, ధన, ఆస్తిరక్షణ కలిపించగలరని కోరుతున్నాను-"

పి.పి.ఓ. నుదురుకు చెమట పట్టింది- తెల్లటి కర్చీఫ్‌తో నుదురు తుడుచుకొని కుర్చీలో కూలబడి పోయాడు-

కాసేపు గాలిస్తంభించి పోయింది-

ముసలయ్య వనుకుతూ బిగుసుకపోయి నిలుచున్న వాడల్లా పిట్టలా నోరుతెరిచి-

"మా బతుకులు సూసెటోల్లెవలు లేరుదొరా! ఎంటికెలున్న కొప్పు ఎటు ముడిసినా సక్కంగనే ఉంటది బాంచెన్– గరీబోడు ఏదిసేసిన తప్పే– నీ బాంచెన్ దొరా! సానా ఏండ్లనుంచి దుర్జెట్ట బతుకులు బతికినం– పసురాల తీర్గ– కొడితెపడ్డం తిడితె పడ్డం– నోరెత్తలేదు– గుడ్లలనీల్లు గుడ్లల్ల గుక్కుకున్నం– మా కడుపు నొప్పేందని ఏ సర్కారు అడుగలేదు. ఓట్లచ్చినయని ఇల్లిల్లు దిర్గినోల్లు మల్లమా మొఖం సూల్లే– మేమెన్ని బాధలు పడ్డమో? గ పరమాత్ముని కెరుక–"

"పరమాత్మ డనేటోడే ఉంటె మన బతుకులు గిట్లెందుకు తెల్లారిపోతు" లక్ష్మి గునిసింది–

"ససరా దేపిల్లా! ఆడున్నడో? ఉంటె ఏడ తాగిపన్నడో మన కెందుకు– గ అకీలుదొర ఎన్నెన్ని పుండకోరు మాటలు మన మీన– పుట్టిచ్చి సెప్పిండు? ఇన్నరు గదా! మనకట్టం సుఖం మనం సెప్పుకుందాం–" ముసలయ్య కసిరి కొంచెం ముంగటికి జరిగిండు–

"నాకా బాంచెన్ కానూన్లెర్కలే– మాటనెనుక మాట ఇలవరిసెబెట్టి మాట్లాడ రాదు– పనిసేసి బతికినోన్ని బాంచెన్– మాటలుసేసి బతికినోన్ని గాదు– కాలం సూడవోతె నోరున్నోనిదే ఊరంటంది– తమరు అరన్నం దింటరు బాంచెన్– గ అడ్ల గింజలు బురదలనుంచి తీసేటందుకు మేంపడే కట్టం ఏంజెప్పాలె బాంచెన్– గట్ల కట్టపడి గ అరన్నాలడుగలే బాంచెన్– కాసన్ని గంజినీళ్లు దొరికితె గదే పరమాన్న మనుకున్నం– కని మావూరి దొరకు మమ్మల గట్ల సుత బతకనియ్యటం ఇట్టం లేదు బాంచెన్– కడుపుకు సాలక కములమడిగినం– మేం నెత్తురు దారవోసి బయలు సేసు కున్న సెలుకలు కబాజసేసుకోకుండన్నం– మమ్మల గొడ్లను గొట్టినట్టు కొట్టకన్నం– మా ఆడోల్ల మనుషుల తీర్గ సూడుమన్నం– ఏంజెప్పాలె పెద్దొర– మేంసెప్పరాని బాధలు బడ్డం– సెప్పుకుంటె మానంబోద్ది సెప్పుకోకుంటె పానంబోద్ది–

మేం ఇగ గట్ల బతుకలేం అనుకున్నది తప్పయింది– మామీద కోతుకం బెట్టుకున్నడుదొర–

ఇవ్వాల్టినుక అకీలు దొర మేంసెయ్యని తప్పుల గురించి సానా చెప్పిండు– పోలీసోల్లు, దొర సేసిన తప్పుల గురించి చెప్పలేదు– మా...."

"ఓముసలోడా! గీడ గయ్యన్ని సెప్పేంలాభం– నీ గుడ్డపేగులోని మాట లెవలింటరు?" ఒకపడుసోడు–

వకీల్లు అనాసక్తిగా ముచ్చట్లు బెట్టుకుంటున్నారు–

714

ముసలోడు అదేపనిగా ఏదో చెప్పుతున్నాడు జడ్జి. మధ్య మధ్య బల్లమీద కొడుతూనే ఉన్నాడు-

చాలాసేపటి నుండి ఇదంతా చూస్తున్న బర్ల ఓదెలుకు ముఖమంతా ఎరుపెక్కింది- పెదిమలు అదురుతున్నాయి- కొంచెం కుడిపక్క నుండి చొల్లుకారుతోంది- అతను గట్టిగా సరాయించి

"దొరా!-గియ్యన్ని సెప్పేంలాభం- నాదొక్క మాటున్నది కాసంత సెవున బెట్టుండ్లి- అయింక తమరు చేసేది చెయ్యండ్లి-"

వకీల్లు ముచ్చెట్లాపిండ్లు-

"అకీలుదొర మాదొర పచ్చాన సానా చెప్పిండ్లు- గయ్యన్ని కాదని మావోడు బారతం చెప్పుకొచ్చిండు- అకీలు సెప్పిన సంగతులు కాదని మేమంత మొత్తుకున్నా తమరి ముంగటికి సాచ్చ్యాలుదెత్తరు-

అకీలుదొర మమ్ముల దొంగలన్నడు లంగలన్నడు- లపంగులన్నడు- పానాలుదీసే కటికోల్లన్నడు- అంతేకాదు అకీలుదొర...."

పి పి ఓ. కండ్లు పులపొడిసిండు-

"మేం దొంగలమే దొరా! అకీలు దొరన్నట్టు మేం దొంగలమే అయ్యుంటే మా పెయిమీన అంగిలేకుంట నారపడి దోరపడి సరిగెలబడి గిట్ల మీ ముంగట నిల్సోక పోనే పోదుము- గీ దేశంల మసకండ్ల ముంగట దొంగతనం జేసేటోడు ఒకడు- గుప్పు చాపుగ కిందికుంద కిందుండంగనే మీదికుంద మీదుండగనే నడిమికుంద తప్పుదీసెటోడు మరొకడు- అగో గాడు బాగుపడిపోతండు- పదేండ్లకింద నా దగ్గర అయిదెకురాల అవ్వల్దర్జ పెరడుండె- గదేమయిపోయింది- దొర పెరట్ల గల్సిపోయింది- దొర దొరే మల్ల నేను దొంగనయిపోయిన- నా కుటుంబం పోయింది- ఇల్లుబోయింది- పెండ్లాం సచ్చింది- ఆఖరుకు పోరగండ్లసుత బతికిచ్చుకోలేకపోయిన— గీ ఊడుల నేను కట్టెబట్టుకొని బర్లకాసి బతుకుతున్న- దొర నాకండ్ల ముంగట ఏటకేట పెరిగిపోయిండు- ఇరువై ఎకరాలోడు నూర్లెకరాలోడయ్యిండు- ఎకరం అరెకరమోడు మల్లెగల్సిపోయిండు- మల్లెగల్సినోడు దొంగ... పెరిగిపోయినోడు, మా బతుకుల్ల మన్నుబోసినోడు దొర-

మేము సంఘంబెట్టుకున్నం నిచ్చమే. గిందుల దాపుకంలేదు మాపుకంలేదు- ఆ మాటకత్తె నా తలమీసెంటికలన్ని దొరలకు సంఘాలున్నాయి- పారిటీలున్నాయి- కడుపుకు జాలదన్నం నిచ్చమే- మరి మాకేమిచ్చిండ్లు- తన్నులు గుద్దులు.

715

బతుకుదెరువు కోసం పరంబోగుల మావోల్లు నాగండ్లు గట్టిండ్లు– సెయ్యి బొప్పి బెట్టుకోని మా ఊల్లెకచ్చిన తెల్లబట్టలాయిన బంజెర్లు, పరంబోగులు ఇప్పి త్తనన్నడు దొరగన్క– మేం దున్నుకుంటె దొంగలం– నచ్చలేట్లం–

అఖర్న మేం ఇండ్లు గాలబెట్టినమన్నడు– పంటలు ఖరాబు చేసినమన్నడు

దొరా! గీ సెత్తసూడుదొరా! మట్టి - మట్టిలబుట్టి మట్టిదిని మట్టిల నుంచి పంటలుదీసేటోల్లం మేము– ఒక్కొక్క గింజకు ఎన్ని నెత్తురు బొట్లు అడుపుతమో లెక్కలేదు. మబ్బు మెత్తబడ్డకాన్నుంచి మామనుసు మెత్తబడ్తది– కర్రి ఏనుకుంటె మాకు పానంబడ్తది. మా రాకేత్తే మాగుండెలు గుబగుబలాడ్తయి– దాన్నిపానంల పానంగా సాది సవరచ్చనజేసి– కోసి కుప్పేసి ఇత్తులు జేత్తే బత్తాలుకుట్టిచ్చి ఎత్తుక పొయినోడుదొర– ఉత్త సేతులతోని మిగిలిన మేం దొంగలం– గ పంటల సాదేనెనరే లేకుంటె దొరా మేం బండ బారిపోతం– మాకేందాకున్న మేం పంటల సొత్తనే ఉన్నం– గంత కట్టపడి మేం పంట బండిచ్చెటోల్లం కని నాశిడం చేసెటోల్లంగాదు దొరా! మా నెత్తురంత ధారవోసి పంటల బెంచినట్టుగనే దొరను పెంచినం– పసురాల బెంచినం– మా బతుకులు కట్టుకొని మీ సేవలుసేసినం– మేం ఒక్కొక్క పెల్ల పేర్చి ఇండ్లు గట్టెటోల్లం దొరా! కూలగొట్టెటోల్లం గాదు–

ఇక సంపెటోల్లన్నరు– గ తెగుపే మాకుంటె దొర ఒక్కడు గింత మంది మీద ఎక్కిసవారెట్ల జేత్తడుదొరా! నామట్టుకు నేను కోడిపిల్లను గోసెపుగ– నెత్తురు షూత్తె నాకండ్లు సిరుతలు గమ్ముతయ్–!"

ఓదెలు పిచ్చోనితీరు చుట్టూ చూసిండు–

"మనమంతా నిలుసున్న గీ కచ్చీరు ఇల్లే ఉన్నదనుకోండ్లి దొరా! దంగులు గొట్టి, ఇటికలుజేసి మాడెంటికలు ఊసిపోంగ సిల్లు నిప్పులు దాగి దీన్నికట్టినోన్ని కూలగొట్టు మనుండ్లి ఆడెంత ఇదయిపోతడో– ఆనిమనుసెంత సుమ్మర్లు సుట్టుకపోద్దో! గ కిట్టందెల్వనోడు మూడు ఘడియల్ల సత్తెనాశిడం చేత్తడు–

మా పానాలు, మానాలు దీసిండ్లు, మా పంటలు ఎత్తుకపోయిండ్లు, మా భూములు గుంజుకున్నరు. ఇండ్లు కాలబెట్టిండ్లు, సంపేసిండ్లు– మేం గ సత్తెనాశిడాన్ని సూడలేక ఒక్కటయినం–

మా నెత్తురును మేం సంపుకోం– కాని ఇంకొకడు సంపుతాంటే ఇగ సూడం– దొరా మేము అన్ని చీజ్‌ల తయారుజేసెటోల్లం– మిమ్ముల, మీ బంగుళాల అన్ని....

716

అన్ని– అన్ని మేమే తయారుజేసినం– అయ్యన్ని నాశనం చేత్తేమేం ఊకోము మమ్ముల మరేమన్న అనుండ్లి– నచ్చలేటులే అనుండ్లి ఇంకేమన్నా అనుండ్లి– మాకేంపరువలేదు మానెత్తురు మరుగుతాంది దొరా!"

జడ్జి అసహనంగా కుర్చీలో నుండి లేచి ముఖం మాడ్చుకొని గొంతుచించి ఆడర్ ఆడర్ అంటూ అరిచిండు–

కేసు వాయిదా వేసినట్టుగా ప్రకటించి జడ్జి పక్కగదిలోకి వెళ్లిపోయాడు–

పోలీసులు రైతుల చేతులకు సంకెల్లుతగిలించి వ్యానెక్కించారు–

ఎల్లయ్య ముఖం విప్పారింది– సంతోషంతో ఓదెలును కౌగిలించుకున్నాడు–

దూరంగా నిలుచున్న బక్కపలుచటి వ్యక్తొకడు పిడికిలెత్తి ఎర్రి సలాం చెప్పిండు–

వ్యాను కదిలింది–

చేతుల సంకెల్లు ఒకటికొకటి తాకిస్తూన్నారు– ఆ శబ్దంతో ఎల్లయ్య గొంతెత్తి పాటపాడుతున్నాడు–

"మా రక్తంతో సృష్టిస్తున్నా
తిండిగింజలు కట్టుగుడ్డలు....
పెట్టుబడులతో దోచుకు దాచే....
ద్రోహుల గుండెలొ అగ్నికణములై...."

ఓదెలు ఇంకా పలవరిస్తున్నట్టుగా గొణుగుతూనే ఉన్నాడు.

"మా నెత్తురు– మా మాంసం– మా బొక్కలు– మా మూలుగు– మా బతుకు– మా సుఖం కష్టం– చెమట– కన్నీల్లు మేం నాశిడంజేసుకుంటాముర?"....

ఎవరు ఖైదీ?

నువ్వేమో
ఆ గదిలో కూర్చొని
బయట....
కిటికీ చువ్వల కటకటాల వెనుక
తూరుపు కొండల కొమ్మల్లో
పూస్తున్న అరుణ పుష్పం
జైల్లో ఉందనుకుంటూ
నిరాశ పడుతున్నావు
రా.... గది బయటికి.

– శంకర్

717